ఆ వారం వీక్లీ ఆత్రంగా అందుకుంది ఆమె. త్వరితంగా పేజీలు తిరగవేస్తుండగా హఠాత్తుగా ఆగిపోయింది ఆమె దృష్టి సంతోషంతో ఉక్కిరి బిక్కిరి అయింది. ఎన్నాళ్ళుగానో ఎదురు చూచిన ఆనందం స్పష్టంగా ఆమె ముఖంలో కనిపించ సాగింది. పుస్తకం మడిచి పట్టుకుని చరచరా వీధిగదిలోకి వెళ్ళింది.


అక్కడ పిల్లలతో సరదాగా కాలక్షేపం చేస్తున్నాడు అతను. అంతే ఆమెదగ్గర. "ఏమండీ ఈ వీక్లీ చూశారా" అంది సంతోషాన్ని కళ్ళల్లో దాచి పెడుతూ.

'ఏది ఇప్పుడేగా వచ్చింది ఎలాగూ నువ్వు పూర్తిగా చదవందే నాకివ్వవని తెలుసు అందుచేత చూడాలనే ప్రయత్నంకూడా చేయలేదు. అయిందా నీవు చదవటం' అన్నాడతను. 'నేనింకా చదవటం పూర్తికాలేదు కాని. ఇదుగో చూడండి. ఈ కథ చదివి ఎలావుందో చెప్పండి" అంది ఆమె పుస్తకం తెరిచి పేజీ చూపిస్తూ.

"ఏమిటి విశేషం కథ బావుందా" అన్నాడతను పుస్తకం తీసుకుంటూ.

"చదివి మీరే చెప్పాలి" అంటూ వెనుదిరిగింది ఆమె.

ఆమె వెళ్ళిందికదా అని కథ చదవటం



మొదలు పెట్టాడతను. మూడు పేరాలు చదివాడు. ఏమిటో గందరగోళంగా ఉండి అర్థంకావటం లేదతనికి. ఆమె మళ్ళీవచ్చి అడుగుతుందనే భయంతో ఒక పేజీ చదవటం పూర్తిచేసాడు. ఇక విసుగొచ్చి లాభంలేదని కథ వదలి బొమ్మలుచూసి పుస్తకం ప్రక్కన పెడుతూండగా ఆమె వచ్చింది.

'కథ చదివారా" అంది.

"ఆ సగం చదివాను. ఏమిటోగా ఉంది. పోనిద్దు"

ముఖం ముడుచుకుంది ఆమె.

"పోనీ క్రింద పేరన్నా చూసారా,"

"ఏం ఎవరు వ్రాశారేమిటి"

ఆమె మాట్లాడకుండా పుస్తకంతెరచి ఆ కథ రచించిన వారిపేరుదగ్గర వేలుపెట్టి చూపించింది "కె. రజని" అని ఉంది. మొదట తెల్లబోయాడతను... తర్వాత 'ఈ కథ వ్రాసింది నువ్వేనా" అన్నాడు నవ్వుతూ.

"నేనే" అందామె ఠీవిగా.

"నిజంగా నువ్వేనా ?" ఆశ్చర్యం వ్యక్తపరిచాడతను.

'అవునుకాని నిజం చెప్పండి. కథ బావుందా లేదా ?'

"కథల సంగతి నాకేంతెల్సు. అయినా బాగానే ఉండి ఉంటుంది. లేకపోతే పత్రికవాళ్ళు ఎందుకు వేసుకుంటారు"

'కథ బావుండనిదే వేసుకోరు నిజమే. ఈ సంగతి నాకు బాగాతెల్సు. ఈకథలో భాష బావుంది. ఎంతో ఆలోచించి ఎన్నో పేజీలు ఖరాబుచేసి వ్రాసిన కథయిది. అయితే మీకు ఎందుకని చదవ బుద్ధికాలేదు ?" ఆలోచనగా అంది ఆమె. భాష. ఆ భాషే నాకు కొరుకుడు పడలేదు. ఏమిటో కవిత్వంలా ఉంది" అన్నాడతను నవ్వుతూ

ఇంతలో విశ్వం వచ్చాడు "రావోయ్ బావ మరిదీ వచ్చి కూర్చో" అంటూ ఆహ్వానించాడు అతను.

మంచినీళ్ళు తేవటానికి లోపలికి వెళ్ళింది ఆమె. "ఏమిటి బావా విశేషాలు" అన్నాడు విశ్వం. 'ఒక క్రొత్త విశేషం, మీ అక్క కథ వ్రాసింది యిదిగో యిందులో ప్రచురించబడింది." అన్నాడు అతను.

మంచినీళ్ళు తీసుకుని ఆమె వచ్చింది. కథచూస్తూ "నిజంగా భలేపని చేసింది అక్క. కంగ్రాచ్యులేషన్స్" అన్నాడు విశ్వం నవ్వుతూ.

'ఆ సంగతి పోనివ్వరా ఏమిటి సంగతులు. అమ్మా, నాన్నగారు బావున్నారా,' అంటూ కూర్చుంది సోఫాలో ఆమె.

'బాగానే ఉన్నారుకాని అక్కా! నువ్వొక పని చేయకూడదూ'

'ఏమిటి' కుతూహలంగా అంది ఆమె.

"ఏమిలేదు. ఒక నవల వ్రాయటం మొదలు పెట్టెయ్యి. ఏదైనా వీక్లీకి పంపవచ్చు. లేకపోతే నాకు తెలిసిన పబ్లిషర్సు ఒకతను ఉన్నాడు."

అయోమయంలో పడ్డాడు అతను. ఆమె వికారం మొహం వేసింది. వాళ్ళిద్దరినీచూసి మాటలు ఆపేసాడు విశ్వం.

ఏమిటి తమ్ముడూ నీవంటున్నది." అందిఆమె తేరుకుని.

"నవల వ్రాయమంటున్నాను" అన్నాడు విశ్వం

'అదంత తేలికనుకుంటున్నావా" అంది ఆమె భయంగా.

'ఏమీ ఫరవాలేదు. మొదలు పెట్టక్కా. వ్రాస్తూవుంటే బాగానే వస్తుందిలే. అన్నట్లు బావగారూ అక్కకు వైట్ పేపర్సు సప్లయి చెయ్యండి. యింకా బాటిల్ వుందికదా ! అక్కా నీ దగ్గర సరిగా వ్రాసే పెన్ను ఉందా ? లేకపోతే నా పెన్ను తీసుకో 'అంటూ పెన్ను అందివ్వబోయాడు విశ్వం.

నా దగ్గర వుందిలేరా" అంది ఆమె.

"నవల పూర్తయిన తరువాత ఎవరికైనా అంకితం యిస్తారనుకుంటాను" అన్నాడు అతను నవ్వుతూ. 'అవును. నిజమే బావా ! అంకితం ఎవరికిస్తే బావుంటుందక్కా దేవుడికా, లేక పోతే మనకి చిన్నప్పుడు బ్రతిమాలి అక్షరాలు వ్రాయించే ముసలి మాస్టారుకా? అవును. ఆయనకయితేనే బావుంటుంది. పెద్దవాడు. సంతోషిస్తాడు "

'ఏం ఆయన తప్పితే యింకెవ్వరూ తగరా ఏమిటి" అన్నాడు అతడు.

'ఇది మరీ బావుంది. ఆలూలేదు. చూలులేదు మనవడిపేరు సోమలింగం అన్నట్లు. నేను వ్రాసింది ఒక్క కథ. మీరిద్దరూ కలిసినన్నొక పెద్దరైటరుని చేసి మాట్లాడటం ఎవరైన వింటె నవ్వగలరు" అంది ఆమె.

'రైటరంటే జ్ఞాపకం వచ్చింది. వాకిట్లో నా నేమ్ ప్లేటుకు ప్రక్కగా కె. రజని రైటరు అని మరో నేమ్ ప్లేట్ పెడితే బావుంటుంది" అన్నాడు అతను 'ఐడియా-చాలా బావుంది" విశ్వం అన్నాడు.

వాళ్ళిద్దరి మాటలు విని ఆమె తలవంచుకు కూర్చుంది. ఆమెని చూసి 'అక్కా నువ్విలా సీరసంగా కూర్చుంటే కాదు. వెంటనే రచన ప్రారంభించాలి' అన్నాడు విశ్వం.

'ఇదెక్కడి ఖర్మరా బాబూ ఏదో వ్రాయాలని అనిపించినప్పుడు వ్రాస్తారుకాని నీ బలవంతం ఏమిటి."

'అలా అంటే కుదరదు. నేను ఎన్ని కథలు వ్రాసి పత్రికలకు పంపించాను. ఒకటి కూడా పత్రికలలో పడలేదు. జాగ్రత్తగా నా దగ్గరికే వచ్చేస్తాయి. నీవు రాసిన మొదటి కథే పత్రికలో స్థానం సంపాయించుకుంది. అందుచేత మళ్ళీ రాసి పేరు తెచ్చుకోమంటున్నాను. నాకు లభించనిది నీకయినా వస్తే సంతోషిద్దామని. ఏం వ్రాయటం మొదలుపెడ్తావా ?" అన్నాడు విశ్వం.

తమ్ముడి మాటలు త్రోసివేయలేక 'సరేనంది' ఆమె. మరు రోజు వస్తానంటూ లేచి వెళ్ళిపోయాడు విశ్వం.

మరురోజు బండెడు కాగితాలు ముందు వేసుకుని కూర్చుంది ఆమె. మనసులో అల్లిబిల్లిగా ఉన్న ఆలోచనలు మాటలు రూపంలో పొందికగా రావటంలో లేదు కొద్ది కొద్దిగా వ్రాసిన కాగితాలు ఆమె చేతిలో నలిగిపోయి బుట్టనిండుకుంది. ఆమె మొహంనిండా స్వేద బిందువులు. కళ్ళల్లో అలసట, ఆశ, నిరాశల మధ్య ఊగులాడుతున్న మనసు. ఆమెని చూసి అతను నవ్వుకుంటున్నాడు ఆ అవస్థ చూసి జాలిపడ్డాడు. అయినా అప్పుడు ఏం మాట్లాడిన ప్రయోజనం ఉండదని పలుకరించకుండా బయటకు నడిచాడు. వాకిట్లోనే విశ్వం పలకరింపు 'అక్క ఏం చేస్తోందిబావా" అంటూ.

'ప్రసవ వేదన పడుతోంది" అన్నాడు అతను తాపీగా "అదేమిటి ఆరవనెలేగా" విశ్వం కంగారు. "ఫక్కున నవ్వాడు అతను. అదికాదోయ్ యిది ఈ ప్రసవ వేదన వేరు. నిన్న ఏదో వ్రాయమని చెప్పి వెళ్ళావుగా. క్రొత్తగా కథలు వ్రాయటం నవలలు వ్రాయటం ప్రసవ వేదనలాంటిదని "గోపీచంద్ కూడా ఒప్పుకున్నారు అదేయిది"

'అయితే అక్కను చూద్దాం పదండి"

"ఒక అరగంట ఆగి వెళ్దాం"

అరగంట గడిచిన తరువాత ఆమె బయటకు వచ్చింది. సుఖప్రసవం జరిగినట్లుగా ప్రశాంతంగా ఉంది ఆమె మొహం. చేతిలో ఉన్న ఆరు పేజీల్లో గుండుసూది పెట్టి ఇదిగో విశ్వం ఇంతకుమించి నేనేమి వ్రాయలేను. నవలలు. గివలలు అని పెద్ద ఆశ పెట్టుకోబోకు. ఏదో ఒకటి వ్రాస్తే నవల అవుతుందేమిటి? వ్రాసినది చిన్న కథైనా చక్కగా తృప్తి కలిగించేటట్లు ఉండాలి" అంది ఆమె అదే తన అభిప్రాయ మన్నట్లుగా.

'అవును అదే నిజం. ఒరే విశ్వం నీకు పుణ్యముంటుంది. మీ అక్కను బలవంత పెట్టకురా ? ఇవ్వాళ ఈ కథ వ్రాసిందా ? లేచిన దగ్గరనుండి యింతవరకూ నాతో ఒక్క మాట కూడా మాట్లాడలేదు. ఒకటే ఆలోచన పైగా పేపర్లు ముందేసుకుని ఆవిడ పడుతున్న అవస్థ నేను చూడలేనురా బాబూ ఇటువంటి ఉపద్రవం మరెప్పుడూ తెచ్చిపెట్టకు నాయనా !" అన్నాడు అతను, 'మీ మనవి విన్నాం. మీ సూచన అంగీకరించాం" అన్నాడు విశ్వం నవ్వుతూ.

★

---

## ప్రత్యక్ష పన్నులు : పరోక్ష పన్నులు

అలసి సొలసి ఆఫీసునుండి వచ్చిన భర్తను అడిగిందొక లతామణి "ప్రత్యక్ష పన్నులు పరోక్షపన్నులు అంటే ఏమిటండీ!" అంది. మురార్జీదేశాయ్ బడ్జెట్ పన్నులు బయటపడిన మరునాడు దాని కాభర్త ప్రత్యక్షపన్నులంటే నీవుచీరలకనీ సారెలకనీ నాదగ్గరనుంచి సరాసరి వసూలు చేసేడబ్బు పరోక్ష పన్నులంటే చొక్కా చిలక్కొయ్యకు తగిలించినప్పుడు నడీచప్పుడు లేకుండా జేబులు ఖాళీచేయడం అని రకీన సమాధానం చెప్పాడు.